క్లుప్తంగా

నేడు మట్టి వినాయకుల పంపిణీ

పటాన్ టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గాంధీ థీమ్ పార్క్ వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుల ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని ఇరక్‌పల్లి మేఘానాయక్ తండాలో శ్రావణమాసం ముగింపు పురస్కరించుకొని గురువారం హోమం నిర్వహించారు. సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, దేవిదాస్ మహారాజ్‌ల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హోమం, తదితర పూజలు చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు నారాయణ జాదవ్, సంగ్రాం తండావాసులు పాల్గొన్నారు.

ఎల్వోసీ ఉత్తర్వులు అందజేత

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం గోపని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దమ్ము రాములు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అత్యవసర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరుకు సంబంధించి ఎల్వోసీ ఉత్తర్వులు జారీ అయ్యింది. ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి గురువారం ఖేడ్‌లో బాధితుడి కుటుంబ సభ్యులకు ఉత్తర్వును అందజేశారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, విఠల్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఈఎస్‌ఐ కార్మికుల సమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఈఎస్‌ఐలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈఎస్‌ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, సాయికుమార్, సంతోష పాల్గొన్నారు.

పోషకాలపై అవగాహన

పుల్‌కల్(అందోల్) : హైదరాబాద్ సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు మండల పరిధిలోని గొంగ్లూర్‌లో పోషకాహారంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులకు పోషకాల గురించి వివరించారు. చిత్రలేఖనం, మట్టి బొమ్మలు తయారు చేయడం వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించారు.

రైతులను ఆదుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిజాంపూర్ గ్రామ శివారులో దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారం రోజులుగా కురుస్తున్న వానలకు వరి, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది పంటలు దెబ్బతిన్నాయని, ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం నాయకులు రాజశేఖర్ రెడ్డి, జలీల్, ప్రకాష్, కిష్టప్ప, నవాజ్, శివ పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని కార్పొరేటర్ పుష్పనగేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం చెరువులోని గుర్రపు డెక్క గురించి మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ప్రత్యేక నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చిగురు శ్రీను, గాంధీ శ్రీను, కిరణ్ గౌడ్, భాస్కర్, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

జహీరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పరిశీలించారు. గురువారం రంజోల్, పస్తాపూర్, తమ్మడ్‌పల్లి, కొత్తూర్ తదితర గ్రామాలను సందర్శించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పెసర, మినుము, సోయాబీన్, పత్తి పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, ఏఈఓలు రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాసాగర్ చెరువుకు ఆదరణ కరువు

- చెరువు గట్టంతా ముళ్ల పొదలతోనే..
- మినీట్యాంక్ బండ్‌గా మార్చాలంటున్న స్థానికులు
- గతంలో అన్నపూర్ణగా చెరువుకు పేరు
- సుందరీకరణతో సమస్యలు దూరం



చెరువులోకి చెట్ల పొదలు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలం అన్నాసాగర్‌లోని 'అన్నపూర్ణ'గా పేరున్న పెద్ద చెరువుకు ఆదరణ కరువైంది. అందంగా తీర్చిదిద్దాల్సిన చెరువును పాలకవర్గాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. చెరువు ఆయకట్టు వెయ్యి ఎకరాల వరకు ఉండగా, వరి పంటను పండించి ఈ ప్రాంత ప్రజలు, రైతులకు అన్నం పెడుతున్నందుకుగాను 'అన్నపూర్ణ'గా పేరొచ్చింది. అన్నాసాగర్ గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఈ చెరువు సుమారుగా కిలోమీటరు దూరం వరకు చెరువు కట్ట ఉంటుంది. ఇరువైపులా దట్టమైన ముళ్ల పొదలే దర్శనమిస్తాయి. కట్టపై ఉన్న 30 ఫీట్ల రోడ్డును కూడా కొంత భాగం ముళ్ల పొదళ్లు కప్పేయడం వల్ల పలుసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. జోగిపేట వైపు నుంచి నారాయణఖేడ్ వైపు వెళ్లే రోడ్డులో కట్టకు ఎడమ వైపున చాలా భాగం ముళ్ల పొదళ్లు చెరువులోని నీటిలోకి వేలాడుతుంటాయి. సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు సైతం పట్టించుకోవడంలేదు.

చీకటిమయంగా చెరువు కట్ట

అందోలు, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలకు చెందిన ప్రజలు, రైతులు ప్రతి రోజు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి వస్తుంటారు. వారు అన్ని పనులు చూసుకొని అన్నాసాగర్ చెరువు కట్టపై నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రయాణాలు చేస్తుంటారు. అయితే కట్టపై కిలోమీటరు పొడుగునా ఒక్క విద్యుత్ లైటు లేకపోవడం వల్ల వాహనాల లైట్ల వెలుగులోనే కట్టను భయం.. భయంగా దాటాల్సిన పరిస్థితి. ఎవరైనా సైకిళ్లు, కాలినడకన వెళ్లిన ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పి నీటిలోకి దూసుకుపోయిన సంఘటనలు ఉన్నాయి.



శిథిలమైన చెరువు ఛత్రీ బంగ్లా

సుందరీకరణతోనే సమస్యలు దూరం

అన్నాసాగర్ పెద్ద చెరువు కట్టను సుందరీకరణకు నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లయితే సమస్యలు దూరం కావడమే కాకుండా పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. వర్షాకాలంలో నిండుకుండలా మారి చెరువు అలుగు పారిన సమయంలో వందలాదిగా ప్రజలు వీక్షించడానికి చెరువు వద్దకు వస్తుంటారు. అంతే కాకుండా చెరువు కట్ట మధ్యలో ఉన్న ఛత్రీ బంగ్లా కూడా పూర్తిగా శిథిలమైంది. దారిన వెళ్లే వారు ఈ ప్రదేశంలో కొంత సేద తీరే వారు. ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి సుందరీకరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలి



అన్నాసాగర్ చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలి. ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు వెళుతుంటాయి. ఏళ్ల తరబడి అన్నాసాగర్ పెద్ద చెరువుకు అదరణ కరువైంది. పాలకులు సైతం ఈ చెరువును ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చెరువు ఆయకట్టులోని మొత్తం వ్యవసాయ భూమిలో వరి పంటనే పండించడం విశేషంగా చెప్పవచ్చు. ప్రభుత్వం మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంత్రి మంజూరు చేయించాలి.

– ప్రవీణ్‌కుమార్, అన్నాసాగర్

కూలిన ఇళ్లు.. ఆందోళనలో బాధితులు



కూలిన ఇంటిని చూపుతున్న బాధితురాలు అనిత

వట్‌పల్లి(అందోల్): ఎడతెరపిలేకుండా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని సాయిపేట గ్రామంలో మంగళి అనిత, సత్యనారాయణకు చెందిన ఇల్లు బుధవారం రాత్రి కూలింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న ఆ వారు లేచి చూడగా ఇంటి వెనక భాగం కూలిపోయింది. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం..

మునిపల్లి(అందోల్): వర్షాలకు కూలిన ఇళ్ల వివరాలను పంచాయతీ కార్యదర్శులు సేకరిస్తున్నారని ఎంపీడీఓ హరినందర్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన మునిపల్లిలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సుమారు 25 ఇళ్లు కూలిపోయినట్లు తెలిపారు.

కూలిన ఇల్లు..తప్పిన ప్రమాదం

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో బుధవారం రాత్రి భారీ వర్షానికి నాగేష్ ఇల్లు కూలింది. భార్యాభర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి గోడ వెనుక వైపు కూలింది. ఎలాంటి ప్రాణనష్టం కలగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అదే రాత్రి పక్క వారి ఇంటికి వెళ్లి తలదాచుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. బీబీఏ-1, బాటని- 1 కామర్స్-5 ,కంప్యూటర్ సైన్స్-1, హిస్టరీ-1, తెలుగు-1, జువాలజీ-1, అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ విద్యార్హతతోపాటు 55 శాతం ((ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం)) మార్కులు ఉండాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 9 సాయంత్రం 3 గంటల లోపల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. సెప్టెంబరు 10న ఉదయం 10.30 నుంచి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె ఎస్ రత్నప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తారా కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు బోధించేందుకు ఆంగ్లంలో 03, తెలుగులో 04, హిస్టరీలో 01, కెమిస్ట్రీలో 02, పొలిటికల్ సైన్స్ 01, బీబీఏలో 01, బీబీఏ రిటైల్‌లో 01 , కంప్యూటర్ సైన్స్ విభాగంలో 08 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టులకు అతిథి అధ్యాపకులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీలో 55 శాతం మార్కులను కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50% మార్కులను కలిగి ఉండాలని సూచించారు. బోధనా అనుభవం కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోపు కళాశాల ఆఫీసుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల మెమోలతో పాటు బోధన అనుభవం, ఉన్నత విద్యార్హతలు కలిగిన సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను సమర్పించాలని కోరారు. ఇంటర్వ్యూ, డెమోలకు కళాశాలలో సెప్టెంబర్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9441069020, 7989239115 లను సంప్రదించాలని కోరారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న మాణిక్‌రావు

జహీరాబాద్: పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, మిలాద్ ఉల్ నబీ పండుగలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఆర్డీఓ రాజు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని బొల్లారం సీఐ గంగాధర్, బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అన్నారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో పటాన్‌చెరు మండల పరిధిలోని బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో కలిసి ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మండపాల నిర్వాహకులకు పలు సూచనలను సలహాలను అందించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, శివకుమార్, దశరథ్ ఉత్సవ నిర్వాహకులు, పోలీసులు పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సిర్గాపూర్ ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీజే పెడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయకచవితి పండుగ ప్రశాంతగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

రామేశ్వరం చెరువుకు బుంగ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేట రామేశ్వరం చెరువుకు బుంగ పడింది. గురువారం నీరు వృథాగా పోవడంతో అధికారులు తాత్కలికంగా మరమ్మతు పనులు చేపట్టారు. చెరువు తూము వద్ద బుంగ పడి నీరు వృథాగా పోతుందని రైతులు సమచారం ఇవ్వడంతో తహసీల్దార్ శివశ్రీనివాస్, నీటి పారుదల శాఖ డీఈఈ పవన్‌కుమార్ రామేశ్వరం చెరువును సందర్శించారు. బుంగను మూసేసి నీటికి అడ్డుకట్ట వేశారు. కార్యక్రమంలో ఏఈ సూర్యకాంత్, ఆర్‌ఐ మల్లేశం, డీసీసీసబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, రైతులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



పనులు పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి జోన్: వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని చెరువులు, నీటి కుంటలు జలకళను సంతరించుకున్నాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని కింది బజారు మహబూబాబాద్ చెరువును ఆయన పరిశీలించారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు పర్యవేక్షించారు.

చౌరస్తాలో చాయ్ తాగిన మంత్రి



హోటల్లో చాయ్ తాగుతున్న మంత్రి దామోదర

సంగారెడ్డి : సింగూరు ప్రాజెక్టును సందర్శించడానికి వచ్చిన మంత్రి దామోదర తిరుగు ప్రయాణంలో తాడ్దంపల్లి చౌరస్తాలో కాసేపు ఆగారు. అక్కడ ఉన్న హోటల్‌లో చాయ్ తాగుతూ స్థానికులతో మాట్లాడారు. చౌరస్తా బాగా డెవలప్ అయ్యిందని పేర్కొన్నారు. సుల్తాన్పూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా..

పాఠశాల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గురువారం పుల్కల్ మండలంలోని కోడూరు గ్రామ పాఠశాల ప్రహరీ, తదితర సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే పాఠశాల భవనం స్థలాన్ని వివాదాస్పదం చేయొద్దని ఆదేశించారు.

వర్షాలతో దెబ్బతిన్న మినుము పంట



మినుము మొక్కలను పరిశీలిస్తున్న ఏఓ సారిక

రాయికోడ్(అందోల్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మినుము పంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి, పెసర, జొన్న, కంది, మినుము పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇతర పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదని మినుము పంట మాత్రం బాగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. మండలంలో 38ఎకరాల విస్తీర్ణంలో మినుము పంట పాక్షికంగా దెబ్బతిన్నట్లు వివరించారు. మరో రెండుమూడు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే పత్తి రైతులకు తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. పత్తి రైతులు తమ పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపడంపై దృష్టి సారించాలని సూచించారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: వర్షాలకు పట్టణంలో దెబ్బతిన్న రోడ్లను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం పట్టణంలోని అల్లీపూర్, మూసానగర్, ఫయాజ్‌నగర్ ప్రాంతాలను సందర్శించి రోడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. కొత్తూర్(బి) గ్రామ శివారులో ఉన్న నారింజ వాగు ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితిని చూశారు. ఆయన వెంట అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మంజీరా డ్యామ్‌కు భారీగా వరద

సంగారెడ్డి టౌన్ : సింగూరు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో మండలంలోని కలబ్‌గూర్ గ్రామ శివారులోని మంజీరా డ్యాంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బ్యారేజ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1.5 టీఎంసీలు. డ్యాం నిండు కుండలా మారడంతో మూడు గేట్లు ఎత్తి కిందికి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాం ఇన్‌ఫ్లో 24365 క్యూసెక్కులు ఉండగా.. 22,886 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

ఉపాధ్యాయులదే కీలక పాత్ర



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గోదావరి



హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సన్మానించిన నీలం మధు ముదిరాజ్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో..

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అన్ని మండలాల్లోని పాఠశాలు, కళాశాలల్లోను గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. రాధాకృష్ణన్ చిత్ర పటాల వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్



జహీరాబాద్ టౌన్: ఉత్తమ టీచర్ సూర్యకళను సన్మానిస్తున్న జయ విజ్ఞాన భారతి నిర్వాహకులు



నస్తీపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



మునిపల్లి(అందోల్): మాట్లాడుతున్న ఎంఈఓ ధశరథ్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



సంగారెడ్డి రూరల్ : నాగపూర్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



కల్హేర్(నారాయణఖేడ్): కడ్పల్ పాఠశాలలో..

ఏడీఏ కార్యాలయాన్ని వినియోగంలోకి తెస్తాం



భవనాన్ని పరిశీలిస్తున్న జేడీఏ శివప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

జహీరాబాద్ టౌన్: నిధుల కొరతతో ఆగిన ఏడీఏ కార్యాలయ భవనాన్ని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ గురువారం పరిశీలించారు.ఆగస్టు 31న సాక్షి దినపత్రికలో 'ఆగిన పనులు.. తప్పని వెతలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన జహీరాబాద్ సందర్శించిన భవనాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి ఆయనతో మాట్లాడారు. ప్రహరీ తో పాటు కరెంట్, ఫ్యాన్స్ తదితర మైనర్ పనులు మిగిలి ఉన్నాయని, రూ.10 లక్షలు ఖర్చుచేస్తే వినియోగంలోకి వస్తుందని కాంట్రాక్టర్ చెప్పారు. పంచాయత్ రాజ్ శాఖ అధికారులతో మాట్లాడి మిగులు పనులు పూర్తి చేయించాలని ఏడీఏ భిక్షపతిని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులతో తాను మాట్లాడుతానని చెప్పారు. అనంతరం దెబ్బతిని శిథిలావస్థకు చేరిన పాత ఏడీఏ కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఓ.లావణ్య, ఏఈఓ. ప్రదీప్‌కుమార్‌లు ఉన్నారు.